క్లుప్తంగా

మోటమర్రికి పేర్ని కిట్టు పరామర్శ



మచిలీపట్నంటౌన్: ఇటీవల సతీవియోగం పొందిన మున్సిపల్ మాజీ చైర్మన్ మోటమర్రి బాబాప్రసాద్‌ను వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పేర్ని కృష్ణమూర్తి(కిట్టు) బుధవారం పరామర్శించారు. చెమ్మనగిరిపేటలోని బాబా ప్రసాద్ నివాసానికి వెళ్లిన కిట్టు ఆయనను పరామర్శించి కుటుంబసభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. బాబాప్రసాద్‌ను పరామర్శించిన వారిలో మాజీ జెడ్పీటీసీ సభ్యుడు లంకే వెంకటేశ్వరరావు, కార్పొరేటర్లు తిరుమలశెట్టి వరప్రసాద్, పర్ణం సతీష్, కోఆప్షన్ సభ్యుడు బేతపూడి రవి, వైఎస్సార్ సీపీ నాయకులు గాజుల భగవాన్, కారుమూరి శంకర్ తదితరులు ఉన్నారు.

గృహ నిర్మాణాలపై సమీక్ష

పెడన: ఆయా కాలనీల్లో పేదలకు మంజూరు చేసిన ఇళ్లస్థలాల్లో లబ్ధిదారులు త్వరితగతిన ఇళ్ల నిర్మాణాలను ప్రారంభించేలా సచివాలయ ఎమినిటీస్ సెక్రటరీలు పర్యవేక్షించాలని మున్సిపల్ కమిషనర్ ఎం.గోపాలరావు ఆదేశించారు.కమిషనర్ బుధవారం తన ఛాంబరులో హౌసింగ్ అర్బన్ ఏఈ మాధవితో కలిసి వార్డు సచివాలయాల ఎమినిటీస్ సెక్రటరీలతో కలిసి హౌసింగ్‌పై సమీక్షా సమావేశం నిర్వహించారు. పల్లోటి-1, పల్లోటి-2, పైడమ్మ కాలనీల్లో కొందరు లబ్ధిదారులు పనులు ప్రారంభించలేదని, వారు గృహనిర్మాణ పనులను ప్రారంభించేలా చూడాలని ఆదేశించారు. డిసెంబరులోగా పనులు పూర్తి చేస్తే పూర్తిస్థాయి బిల్లులు వస్తాయని వివరించారు. ఆ తరువాత బిల్లులు నిలిచిపోతాయనే విషయాన్ని లబ్ధిదారులకు వివరించి గృహనిర్మాణ పనులు త్వరితగతిన పూర్తయ్యేలా చూడాలని సూచించారు.

80 మందికి గుండె పరీక్షలు

పెదకళ్లేపల్లి(మోపిదేవి): మండలంలోని పెదకళ్లేపల్లిలోలో బుధవారం విజయవాడ హెల్ప్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత గుండె వైద్యశిబిరం నిర్వహించారు.80మందికి ఈసీజీ, 2డి ఎకో, స్కానింగ్ పరీక్షలు ఉచితంగా నిర్వహించి మందులు పంపిణీ చేశారు. 10మందికి మెరుగైన చికిత్స అవసరమని గుర్తించారు. డాక్టర్ జోల సాయి మాట్లాడుతూ ఆయాసం, గుండె దడ, గుండె నొప్పి, గుండె బరువుగా ఉండటం, తల తిరగడం, ఎడమ చేయి లాగడం వంటి లక్షణాలు ఉన్నవారు వెంటనే వైద్యశాలలో సంప్రదించాలని సూచించారు. సర్పంచ్ అరజా సంధ్యారాణి, అరజా కిరణ్ కాంత్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నీతులు మాని ఇసుక దందా అరికట్టాలి

మాజీ ఎమ్మెల్యే సింహాద్రి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు

అవనిగడ్డ: ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ వేదికలపై నీతులు చెప్పడం మాని తనమనుషులు చేస్తున్న ఇసుక దందాను అరికట్టేందుకు తగిన చర్యలు తీసుకోవాలని మాజీఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు డిమాండ్ చేశారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయం వద్ద బుధవారం సాయంత్రం నియోజకవర్గ స్థాయి కార్యకర్తల సమావేశం జరిగింది. దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మాజీఎమ్మెల్యే సింహాద్రి మాట్లాడుతూ కూటమి నేతలు, కార్యకర్తలు యథేచ్ఛగా ఇసుకదందా కొనసాగిస్తుంటే, సభావేదికలపై మాత్రం ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ అటువంటివారిపై అధికారులు చర్యలు తీసుకోవాలంటూ నీతి కబుర్లు చెబుతారని ఎద్దేవా చేశారు. పులిగడ్డ అక్విడెక్టుకు సమీపంలో రాత్రిళ్లు నిత్యం వందల ట్రాక్టర్లతో ఆయన అనుచరులు, కూటమి నాయకులు పెద్దఎత్తున ఇసుక రవాణా చేస్తున్నారన్నారు. నిమ్మగడ్డలో ఇసుక ముఠా ఏకంగా ఎస్‌ఐపై దాడికి తెగబడినా ఎమ్మెల్యే స్పందించలేదన్నారు. అవనిగడ్డ-కోడూరు రోడ్డు నిర్మాణ పనులు సాగకుండా ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ ఎందుకు అడ్డుపడుతున్నారో ప్రజలకు సమాధానం చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. తాను వైఎస్సార్‌సీపీని వీడి టీడీపీలో చేరుతున్నట్టు చేస్తున్న దుష్ప్రచారాన్ని ఎవరూ నమ్మొద్దని స్పష్టం చేశారు. చివరి వరకూ మాజీసీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే ఉంటానన్నారు. కార్యకర్తకు ఏ కష్టం వచ్చినా వెన్నంటి ఉంటానని హామీ ఇచ్చారు. తాను దాడులు చేయిస్తున్నట్టు మాట్లాడుతున్న టీడీపీ పరిశీలకుడు కనపర్తి శ్రీనివాసరావు వాస్తవాలు తెలుసుకుని మాట్లాడాలన్నారు. ప్రశాంతంగా ఉన్న నియోజకవర్గంలో రెచ్చగొట్టే వ్యాఖ్యలు మానుకోవాలని హితవు పలికారు. వైఎస్సార్‌సీపీ రైతు విభాగం జోనల్ ఇన్‌చార్జి కడవకొల్లు నరసింహారావు మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలకు పార్టీ అండగా ఉంటుందని వివరించారు. సమావేశానికి ఎంపీపీ తుంగల సుమతీదేవి అధ్యక్షత వహించగా, యువనేత సింహాద్రి వికాస్, అవనిగడ్డ, ఘంటసాల జెడ్పీటీసీలు చింతలపూడి లక్ష్మీనారాయణ, తుమ్మల మురళి, నియోజకవర్గ అధికార ప్రతినిధి సింహాద్రి వెంకటేశ్వరరావు, అవనిగడ్డ, మోపిదేవి, ఘంటసాల, కోడూరు, చల్లపల్లి మండల పార్టీ కన్వీనర్లు రేపల్లె శ్రీనివాసరావు, గరికపాటి వెంకటేశ్వరరావు, వేమూరి వెంకట్రావ్, పరిశె మాధవరావు, వెంకట సత్యనారాయణ, ఘంటసాల, అవనిగడ్డ వైస్ ఎంపీపీలు మోడెం నాగరాజు, దిడ్ల కిరణ్, పులిగడ్డ పిచ్చేశ్వరరావు, పార్టీ ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి నలుకుర్తి రమేష్, మాజీ సర్పంచ్ నలుకుర్తి పృథ్వీరాజ్, పార్టీ నాయకులు కొండవీటి వెంకటనారాయణ, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

శిక్షణ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోండి

కోనేరుసెంటర్: ఉద్యోగ, ఉపాధి అవకాశాల కోసం నిర్వహించే శిక్షణ తరగతులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కృష్ణా విశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఆర్.విజయకుమారి అన్నారు. మచిలీపట్నం కృష్ణా విశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ కళాశాలలోని ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ విభాగంలో ఈ నెల 13 నుంచి 15వ తేదీ వరకు అనిత టెక్నాలజీస్ సంస్థ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు జరగనున్న ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్(ఐఓటీ) వర్క్ షాప్ శిక్షణ తరగతులను ఆమె ప్రారంభించారు. ఈ తరగతులను ఐఓటీ ప్రతినిధి మణికంఠ అతని టీమ్ సభ్యులు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇటీవల విద్యార్థులకు క్యాంపస్ లోనే ఉద్యోగ, ఉపాధి అవకాశాల శిక్షణ కార్యక్రమాలను ఏర్పాటు చేశామన్నారు. ఇలాంటి వర్క్ షాప్ కార్యక్రమాలు తరచూ జరగడం ద్వారా విద్యార్థుల ఉద్యోగ అవకాశాలకు దోహదపడతాయన్నారు. ఇంజినీరింగ్ కళాశాల డీన్ ఆచార్య వైకే సుందరకృష్ణ మాట్లాడుతూ సాంకేతికంగా దూసుకుపోతున్న ఈ రోజుల్లో సాంకేతిక విద్యారంగంలోని విద్యార్థులకు కనీస నైపుణ్యం లేకపోతే ఉద్యోగ అవకాశాలు పొందడం చాలా కష్టతరం అవుతుందన్నారు. ఎలక్ట్రానిక్స్ విభాగంలోని మూడు, నాలుగో సంవత్సరం విద్యార్థులకు నిర్వహించే ఈ మూడు రోజుల వర్క్ షాప్‌కు సమన్వయకర్తగా కె.జి.వెంకటకృష్ణ వ్యవహరించనున్నట్లు ఆయన తెలిపారు.

దాతృత్వం చాటిన ఉపాధ్యాయులు



నగదును అందిస్తున్న రామకృష్ణాపురం ఉపాధ్యాయులు

కోడూరు: రామకృష్ణాపురం ప్రాథమికోన్నత పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థుల శ్రేయస్సు దృష్ట్యా నూతన భవన నిర్మాణానికి అవసరమైన స్థలం కొనుగోలుకు రూ.50వేలను ఆర్థికసాయంగా అందజేసి తమ దాతృత్వాన్ని చాటారు. మండలంలోని రామకృష్ణాపురం, నాగాయలంక మండలంలోని సంగమేశ్వరం పంచాయతీలు సముద్రతీరానికి అతీ సమీపంలో ఉంటాయి. ఈ రెండు పంచాయతీల పరిధిలో కేవలం ప్రాథమిక ఉన్నత పాఠశాలలు మాత్రమే ఉన్నాయి. దీంతో అక్కడ విద్యార్థులు ఎనిమిదో తరగతి వరకు ఆ గ్రామ పాఠశాలలో చదివి, 9,10 తరగతులు చదివేందుకు కోడూరు లేక నాగాయలంక మండల కేంద్రాల్లోని జెడ్పీ పాఠశాలలకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. దీంతో ఉపాధ్యాయులు స్పందించి పాఠశాలను జెడ్పీ ఉన్నత పాఠశాలగా అప్‌గ్రేడ్ చేసి గ్రామంలో 9.10 తరగతుల నిర్వహణకు అవసరమైన 80సెంట్ల స్థలాన్ని కొనుగోలు చేసేందుకు ముందుడుగు వేశారు. పాఠశాల హెచ్‌ఎం కారాని నాగార్జున, ఉపాధ్యాయులు మన్నె ప్రేమ్‌చంద్, పెరవలి రాంబాబు కలిసి తమవంతు ఆర్థికసాయంగా బుధవారం రూ.50వేలను స్థలం అమ్మకందారుకు అందజేశారు. స్థలం కొనుగోలుకు సంబంధించి మిగిలిన సొమ్మును గ్రామస్తులు, దాతల సహాయంతో చెల్లించనున్నట్లు ఉపాధ్యాయులు వివరించారు ఎంఈఓలు టి.వి.ఎం.రామదాసు, శ్రీనివాసరావు, గ్రామప్రముఖులు పాల్గొన్నారు.

నాగాభరణధారికి నవ హారతుల సౌభాగ్యం

కార్తిక ఏకాదశి పర్వదినాన రామలింగేశ్వరునికి విశేష పూజ



నేత్రపర్వంగా సూర్య హారతి సమర్పిస్తున్న పండితులు



కోటి వత్తుల దీప స్తంభానికి జ్యోతి ప్రజ్వలన జరిపిన భక్తులు

నాగాయలంక: కార్తిక క్షీరాబ్ది ద్వాదశి పర్వదినం పురస్కరించుకుని స్థానిక కృష్ణానది తీరంలోని శ్రీరామ పాదక్షేత్రంలో బుధవారం రాత్రి రామలింగేశ్వర స్వామి మండపంలో శివలింగం, నందీశ్వరులకు ప్రత్యేక నవహారతులు అంగరంగ వైభవంగా సమర్పించారు. కృష్ణానదిలో పౌర్ణమి పోటు కొనసాగడంతో వివిధ ఆకృతులలో నిలబెట్టి స్టాండుల వరకు నదీ జలాలు వచ్చినప్పటికీ వాటిలో కార్తిక దీపాలు వెలిగించేందుకు మహిళలు ఉత్సాహం చూపారు. శివలింగానికి విశేష పూజలు జరిపిన ఉభయదాతలు తంగెళ్ళమూడి లక్ష్మణస్వామి-ప్రభావతి దంపతులు మండపం అభిముఖంలోని కోటి వత్తుల దీప స్తంభానికి జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం అంబాసాయి కిరణ్ శర్మ నేతృత్వంలో శాస్త్రోక్తంగా సాగింది. శిష్ట్లా సుబ్రహ్మణ్యశాస్త్రి, ముదునూరు అచ్యుత్ శర్మ, నరసింహులు స్వామికి నవ హారతులను నయనానందకరంగా సమర్పించారు. తదుపరి మంత్రపుష్ప నీరాజనం, తీర్థ ప్రసాద వితరణ జరిగింది. క్షేత్రం చైర్మన్ ఆలూరి శ్రీనివాసరావు, ఉప్పల లీలాకృష్ణప్రసాద్, తలశిల రఘుశేఖర్ పర్యవేక్షించారు.

క్రీడాకారులకు అభినందన



క్రీడాకారులను అభినందిస్తున్న నాయకులు

గూడూరు: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి బాల్‌బ్యాడ్మింటన్ పోటీల్లో రాణించిన కప్పలదొడ్డి క్రీడాకారులను గ్రామస్తులు అభినందించారు. రాజమండ్రిలో జరిగిన అండర్-17 బాలుర విభాగ పోటీల్లో పాల్గొన్న కప్పలదొడ్డికి చెందిన బొమ్ము రామన్, పేరిశెట్టి నాగపవన్ జట్టు ద్వితీయ స్థానంలో నిలవగా, అనంతపురంలో జరిగిన అండర్-14బాలికల విభాగ పోటీల్లో ప్రాతినిధ్యం వహించిన వాసనసాయిసింధు, మేడక హేమశ్రీ శ్యామల జట్టు నాలుగోస్థానం సాధించింది. ఈ నేపథ్యంలో బుధవారం పాఠశాలలో హెచ్‌ఎం జ్యోతి ఆధ్వర్యంలో సర్పంచి యక్కల మాధవి, ఎంపిటీసీ సభ్యురాలు పేరిశెట్టి తేజోవతి, మాజీ సర్పంచి కట్టా మునేశ్వరరావు, మాజీ ఎంపిటీసీ సభ్యుడు పేరిశెట్టి రమేష్, పీడీ మురళీకృష్ణ, జాతీయ క్రీడాకారుడు ప్రభు, గ్రామస్తులు కలిసి క్రీడాకారులను అభినందించారు. రానున్న కాలంలో మరిన్ని పతకాలు సాధించాలని ఆకాంక్షించారు.

వైభవంగా కార్తిక కోటి దీపోత్సవం



అవనిగడ్డ: స్థానిక లక్ష్మీనారాయణస్వామి ఆలయంలో మంగళవారం కార్తిక కోటి దీపోత్సవ కార్యక్రమం వైభవంగా జరిగింది. కార్యక్రమాన్ని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, కమలానంద భారతి స్వామి ప్రారంభించారు. భక్తులు దీపాలు వెలిగించి పూజలు చేశారు. ఆలయ అర్చకులు బృందావనం వేణుగోపాలాచార్యులు, దీవి రఘునాధాచార్యులు, దీవి అప్పలాచార్యులు, దీవి సారంగపాణి అయ్యంగార్ పూజలు నిర్వహించారు. కార్యక్రమాన్ని ఈవో యార్లగడ్డ శ్రీనివాసరావు, ఆలయ ధర్మకర్త పోతరాజు భాస్కరరావు పర్యవేక్షించారు.

వరిపంట పరిశీలన

కొడాలి(ఘంటసాల): వరి పొలాల్లో మానిపండు తెగులు ఉధృతి నివారణకు రైతులు నివారణ చర్యలు చేపట్టాలని ఘంటసాల కృషి విజ్ఞాకేంద్రం (కేవీకే) సమన్వయకర్త డాక్టర్ డి.సుధారాణి సూచించారు. మండల వ్యవసాయశాఖ అధికారి కె.మురళీ కృష్ణ ఆధ్వర్యంలో కొడాలి, తాడేపల్లి గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏవో మురళీ కృష్ణ, ఉప సర్పంచ్ శంకరరావు, కేవీకే శాస్త్రవేత్త డాక్టర్ నవీన్, వీఏఏ వి.వెంకటలక్ష్మి, కొత్తపల్లి పీఏసీఎస్ మాజీ ఛైర్మన్ తాతినేని వెంకట కృష్ణారావు పాల్గొన్నారు.

విగ్రహావిష్కరణ



కోడూరు: మండలంలోని పిట్టల్లంక పంచాయతీ మాజీ సర్పంచి, బడేవారిపాలెం పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు దివంగత బడే వెంకటరమణ విగ్రహాన్ని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ఆవిష్కరించారు. విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. అనంతరం బుద్ధప్రసాద్ మాట్లాడుతూ రాజకీయాల్లో వివాదాలకు తావులేకుండా వెంకటరమణ మంచి గుర్తింపు తెచ్చుకున్నారని కొనియాడారు. యువనేత మండలి వెంకట్రామ్ (రాజా), కూటమి నేతలు పాల్గొన్నారు.

ఐదోరోజుకు చేరిన రైతుదీక్షలు

బంటుమిల్లి: దాళ్వా సాగు నీటికోసం స్థానిక లక్ష్మీపురం సెంటర్లో చేపట్టిన రిలే దీక్షలు బుధవారం ఐదవరోజుకు చేరుకున్నాయి. అఖిలపక్షం ఆధ్వర్యంలో చేపట్టిన ఈ దీక్షల్లో బంటుమిల్లి, కృత్తివెన్ను మండలాల్లోని పలు గ్రామాలకు చెందిన రైతులు పాల్గొన్నారు. దాళ్వాకు నీరిచ్చి రైతులను కాపాడాలని చౌడు భూములను పరిరక్షించాలని డిమాండ్ చేశారు. ఈ దీక్షలు పలు రాజకీయ పార్టీల నాయకులు పాల్గొని సంఘీభావం తెలిపారు. దీక్షల్లో రైతుసంఘ జిల్లా కార్యదర్శి జి.నాగేశ్వరరావు, నీటి సంఘ మాజీ అధ్యక్షుడు ఎస్.జనార్ధన్‌రావు, వి.సురేష్, సీపీఎం మండల కార్యదర్శి ఎం.శ్రీనివాసరావు, ఎం.శివరాం ప్రసాద్, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

కాశీవిశ్వేశ్వరునికి విశేష పూజలు

భావదేవరపల్లి(నాగాయలంక): కార్తీక క్షీరాబ్ది ద్వాదశి(తులసీవ్రతం-క్షీరాబ్ది శయనవ్రతం) పర్వదినం పురస్కరించుకుని మండలంలోని భావదేవరపల్లి శ్రీఅన్నపూర్ణదేవి సమేత శ్రీకాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో బుధవారం ప్రత్యేక పూజలు చేశారు. అర్చకుడు కొల్లిపర సుబ్బారావు శ్రీకాశీవిశ్వరస్వామికి పసుపు కుంకుమలతో విశేష అలంకారం చేశారు. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త పూషడపు నిరంజనరావు, శివసత్యవతి దంపతులు, మెండు సాయిరామ్, కుంట సంధ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఉపాధి పనుల గుర్తింపు

భావదేవరపల్లి(నాగాయలంక): మండలంలోని భావదేవరపల్లిలో బుధవారం ఉపాధి హామీ పథకంపై గ్రామసభ నిర్వహించారు. రూ.1.42కోట్ల అంచనాలతో 96 పనులను గుర్తించారు. ఏపీఓ టీవీఎస్ ముత్యాలు అధ్యక్షత వహించగా, గ్రామసర్పంచ్ మండలి ఉదయభాస్కర్, కార్యదర్శి, ప్రజాప్రతినిధులు, మేట్లు, డ్వాక్రా స్వయం సహాయక సంఘాల సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

పైపులైన్ ఏర్పాటుకు వినతి

ఘంటసాల: నూతన పైపులైను ఏర్పాటు చేసి తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరుతూ లంకపల్లి గ్రామస్తులు బుధవారం ఘంటసాల ఎంపీడీవో డి.సుబ్బారావుకు వినతిపత్రం అందజేశారు. వినతిపత్రం అందజేసినవారిలో ఎంపీడీవోకు వినతి పత్రం అందజేసినవారిలో పరిశే చలపతి, కొమ్మారెడ్డి లీలాకృష్ణ, వీరమాచినేని ప్రసాద్, తుమ్మల నందీశ్వరరావు ఉన్నారు.

అయ్యప్పదీక్షా పరుల కావడి యాత్ర



మోపిదేవి: గురుస్వామి పరుచూరి సుభాష్ చంద్రబోస్ ఆధ్వర్యంలో 28మంది అయ్యప్ప మాలధారులు ఘంటసాల మండలం తాడేపల్లి నుంచి మోపిదేవి సుబ్రహ్మణ్యేశ్వరస్వామివారి ఆలయంకు బుధవారం కావడి యాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా మోపిదేవిలో యువనాయకులు మండలి వెంకట్రామ్ కావడి యాత్రకు స్వాగతం పలికి సత్కరించారు. అయ్యప్ప దీక్షా పరులు పంచామృతాలు, పాలు, పూలు, పండ్ల, పూజా ద్రవ్యాల కావడిలను ఆలయంలో సమర్పించి స్వామివారిని దర్శించుకున్నారు. వెంకట్రామ్, గురుస్వామిని ఆలయ డీసీ దాసరి శ్రీరామవరప్రసాదరావు ఆలయ మర్యాదలతో సత్కరించారు.

రైతులకు సమాచారం అందించాలి

మోపిదేవి: పంచాయతీ అధికారులు గ్రామంలోని నోటీస్‌బోర్డులో చిన్న, సన్నకారు రైతులకు తగిన సమాచారం అందివ్వాలని కృషివిజ్ఞాన కేంద్రం(కేవీకే) వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ నవీన్ సూచించారు. మోపిదేవి ప్రాథమిక పాఠశాల ఆవరణలో బాపట్ల వ్యవసాయ కళాశాల విద్యార్థులు బుధవారం గ్రామ చిత్రపటం ప్రదర్శించారు. మాజీ సర్పంచ్ రావి నాగేశ్వరావు, కంఠంనేని కుటుంబరావు, బొందలపాటి ప్రసాద్, రావి సురేష్, ప్రసాదరావు, బాపట్ల కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

ఉత్సవమూర్తులకు అభిషేకాలు



బంటుమిల్లి: పాశ్చాపురం గ్రామంలో కొలువై ఉన్న శ్రీ సువర్చలాంజనేయ స్వామివారి ఉత్సవమూర్తులకు బుధవారం అభిషేకాలు నిర్వహించారు. వార్షిక పవిత్రోత్సవాల్లో భాగంగా విష్వక్సేన పూజ చేశారు. ఉత్సవమూర్తులకు పండితులు పరాశరం రంగనాధాచార్యులు, రొంపిచర్ల హనుమంతాచార్యులు పూజలు నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా రాత్రికి స్వామివారి శాంతి కల్యాణం అంగరంగ వైభంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీసభ్యులు, పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

పంచాయితీల అభివృద్ధికి ప్రణాళికలు

బంటుమిల్లి: గ్రామ పంచాయితీ అభివృద్ధి ప్రణాళిక(జీపీడీపీ)పై స్థానిక మండలపరిషత్ కార్యాలయంలో బుధవారం శిక్షణనిచ్చారు. ఎంపీపీ వి.చినబాబు, వైస్ ఎంపిపి కె.లలిత, ఏఓ నీరజాక్షి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

ఘంటసాలలో...

ఘంటసాల: మండల పరిషత్ కార్యాలయంలో శిక్షణ తరగతులు నిర్వహించారు. ఎంపీడీవో డి.సుబ్బారావు, ఈఓపీఆర్డీ కె.వెంకటేశ్వరరావు, అజయ్, ట్రైనర్స్ బి.అర్జునరావు, సోమయ్య, ఫణి పాల్గొన్నారు.